

కథా కౌముది

లఘువు గురువైంది — వంగర శరచ్చంద్ర

ఆదివారం ఉదయం పదకొండు గంటలకు పదిహేడు ఇళ్లలో పదిహేడు ల్యాప్‌టాపులు తెరుచుకున్నాయి. ఒకరి వెనుక వంటగది కనిపిస్తోంది. మరొకరి వెనుక పెళ్లి ఫొటో. ఇంకొకరు వర్చువల్ బ్యాక్‌గ్రౌండ్‌లో హిమాలయాల మధ్య కూర్చున్నారు. శ్రీకాంత్ మాత్రం కెమెరా ఆన్ చేసి, తాను కనిపించడం లేదని అనుకుంటూ రెండు నిమిషాలు జుట్టు సరిచేసుకున్నాడు. స్క్రీన్ మధ్యలో ప్రణవ్ వర్మ ప్రత్యక్షమయ్యాడు. అతని వెనుక తెల్లటి గోడ మీద మూడు ఫ్రేములు ఉన్నాయి—‘తెలుగు. తపన. తన్మయత్వం.’ మూడో పదానికి అర్థం ఏమిటో ప్రణవ్‌ను ఎవరూ అడగలేదు. అడిగినా అతను చెప్పేవాడే. అర్థం తెలియకపోవడం అతని సమస్య కాదు; ఏదో ఒక అర్థం చెప్పలేకపోవడం మాత్రమే అతని సమస్య.

“గుడ్ మార్నింగ్, పోయెట్స్!” అన్నాడు ప్రణవ్.

“గుడ్ మార్నింగ్ సర్!” అని పదిహేడు గొంతులు పలికాయి.

కోర్సు పేరు ‘తెలుగు పద్యం: జీరో టు హీరో.’

ప్రణవ్‌కు ఇరవై ఎనిమిదేళ్లు. తెలుగు సాహిత్యంలో పట్టా లేదు. ఛందస్సులో శిక్షణ లేదు. కానీ అతని సామాజిక మాధ్యమ పరిచయం కింద ఐదు విశేషణాలు ఉండేవి—తెలుగు లాంగ్వేజ్ కోచ్, పోయెట్రీ మెంటార్, కల్చరల్ ఇన్‌ఫ్లుయెన్సర్, ఛందస్సు ఎక్స్‌ప్లోరర్, కంటెంట్ క్రియేటర్. మూడు నెలల క్రితం అతను పెట్టిన ఒక వీడియోకు రెండు లక్షల వీక్షణలు వచ్చాయి. “తెలుగు పద్యం రాయడం చాలా ఈజీ బ్రో!” అన్నది ఆ వీడియో సారాంశం. రెండు లక్షల మంది చూశాక అది అభిప్రాయం కాదు, అర్హత అయింది.

“ఫస్ట్ ఆఫ్ ఆల్, పద్యం అంటే భయపడకండి. మన పూర్వీకులు కొంచెం కాంప్లికేట్ చేశారు. మనం డీకోడ్ చేద్దాం,” అన్నాడు ప్రణవ్. ‘డీకోడ్’ అన్న మాటకు పదిహేడు నోటు పుస్తకాలు తెరుచుకున్నాయి. టేబుల్ మీద నుంచి ఒక

పాత పుస్తకం తీసుకున్నాడు. అట్ట చిరిగిపోయింది. పేజీలు పసుపు రంగులో ఉన్నాయి. రెండు మూడు చోట్ల పురుగులు కూడా తమ సాహిత్యాభిరుచిని చూపించాయి. అట్ట మీద 'సులక్షణ సారము' అని ఉంది. "నిన్న ఓల్డ్ బుక్ మార్కెట్‌లో దొరికింది. వెరీ రేర్ బుక్. నిన్న రాత్రంతా స్టడీ చేశాను," అన్నాడు. నిజానికి రాత్రి పదకొండున్నరకు పుస్తకం తెరిచాడు. పదకొండు నలభైకి పుస్తకం పక్కన పెట్టుకుని ఒక రీల్ చేశాడు. పన్నెండుకు నిద్రపోయాడు. కానీ నిద్రకు ముందు చదివిన పది నిమిషాలు మరుసటి రోజు పరిచయంలో 'రాత్రంతా అధ్యయనం'గా మారాయి.

"ఇవాళ చాలా ఇంపార్టెంట్ కాన్సెప్ట్. లఘువు, గురువు," అంటూ స్క్రీన్ షేర్ చేశాడు. తెల్లటి స్లైడ్ మీద 'లఘువు = చిన్నది, గురువు = బోధించేది' అని కనిపించింది.

పద్మజ కనుబొమ్మలు ముడిచింది. "సర్... గురువు అంటే ఇక్కడ టీచర్ అనే అర్థమేనా?" అని అడిగింది.

ప్రణవ్ చిరునవ్వు నవ్వాడు. అది సమాధానం తెలిసినవాడు నవ్వే నవ్వు కాదు. సమాధానం చెప్పబోతున్నవాడు నవ్వే నవ్వు. "వెరీ గుడ్ క్వశ్చన్," అన్నాడు. సందేహానికి సమాధానం తెలియనప్పుడు 'వెరీ గుడ్ క్వశ్చన్' అనడం అతను ఒక వెబినార్‌లో నేర్చుకున్నాడు.

"మన పూర్వీకుల విజ్డమ్ చూడండి. చిన్నది లఘువు. పెద్దది గురువు. ఎందుకంటే పెద్దది మనల్ని గైడ్ చేస్తుంది."

శ్రీకాంత్ వెంటనే 'పెద్ద అక్షరం మనల్ని గైడ్ చేస్తుంది' అని రాసుకున్నాడు.

"కానీ సర్, మా స్కూల్లో ఉచ్చారణ కాలాన్ని బట్టి లఘువు, గురువు అన్నారు," అని పద్మజ మళ్లీ అడిగింది.

"కరెక్ట్," అన్నాడు ప్రణవ్ ఒక్క క్షణం కూడా ఆగకుండా. "అది ట్రెడిషనల్ అప్రోచ్. నేను కాన్సెప్చువల్ అప్రోచ్ చెబుతున్నాను."

పద్మజ మైక్ ఆఫ్ చేసింది. అనుమానం ఇంకా ఉంది. కానీ 'కాన్సెప్చువల్ అప్రోచ్' ముందు తన పదో తరగతి జ్ఞాపకం కొంచెం చిన్నదిగా కనిపించింది.

ప్రణవ్ పుస్తకంలో మరో వాక్యం చూశాడు. "హ్రస్వాక్షరములు లఘువులు..." అని చదివి ఆగాడు. 'హ్రస్వం' అనే మాటను ఎక్కడో చదివినట్టు ఉంది. కొన్ని క్షణాలు ఆలోచించాడు. పదిహేడు ముఖాలు అతని వైపు చూస్తున్నాయి. తెలియదని చెప్పడానికి అది సరైన సమయం కాదనిపించింది.

"హ్రస్వం అంటే... హర్షం తక్కువగా ఉండటం" అన్నాడు నెమ్మదిగా.

పద్మజ కళ్లు పెద్దవి చేసింది. "అంటే?"

"ఎమోషన్ తక్కువగా ఉన్న అక్షరం లఘువు."

శ్రీకాంత్ తన నోట్సులో ఇంగ్లీషులో 'Emotion-less letter = Laghu' అని రాసుకున్నాడు.

"దీర్ఘం అంటే సర్?" అని రాహుల్ అడిగాడు. ఈసారి ప్రణవ్‌కు సమాధానం వెంటనే వచ్చింది.

"డీప్ ఎమోషన్."

రాహుల్ తల ఊపి "వావ్!" అన్నాడు.

"చూడండి. 'అ' అనండి," అన్నాడు ప్రణవ్. అందరూ "అ" అన్నారు.

"ఏమైనా ఫీల్ అయ్యారా?" ఎవరూ మాట్లాడలేదు. "లేదు కదా? లఘువు. ఇప్పుడు 'ఆఆఆ___' అనండి." పదిహేడు ఇళ్లలో పదిహేడు మంది 'ఆఆఆ___' అన్నారు.

శ్రీకాంత్ భార్య వంటగదిలోంచి వచ్చి అతని గది తలుపు దగ్గర నిలబడింది.

"ఏమైంది?" అని అడిగింది.

"క్లాస్."

"ఏ క్లాస్?"

"తెలుగు."

ఆమె కొన్ని క్షణాలు అతన్ని చూసి ఏమీ మాట్లాడకుండా వెళ్లిపోయింది.

"ఫీల్ అయ్యారా?" అని ప్రణవ్ అడిగాడు.

"అయ్యాం సర్."

"అదే గురువు!" అన్నాడు. చాట్ బాక్సులో చప్పట్ల గుర్తులు పడ్డాయి.

రెండో రోజు గణాల పాఠం మొదలైంది.

ప్రణవ్ పుస్తకం తెరిచి "యమాతారాజభానసలగం___" అని చదివాడు. ఆగాడు. మళ్లీ చదివాడు. ఈసారి నెమ్మదిగా చదివాడు. నెమ్మదిగా చదివితే అర్థం వస్తుందని అతనికి చిన్నప్పటి నుంచి ఒక నమ్మకం. రాలేదు. గూగుల్ చేయాలనుకున్నాడు. స్క్రీన్ షేర్ ఆన్‌లో ఉంది.

"సర్?" అన్నాడు రాహుల్.

ప్రణవ్ ముఖంలో ఒక్కసారిగా వెలుగు వచ్చింది.

"ఇది నిజానికి ఒక కోడ్," అన్నాడు.

పదిహేడు పెన్నులు సిద్ధమయ్యాయి.

"యమ అంటే?"

"యమధర్మరాజు" అన్నాడు శ్రీకాంత్.

"ఎగ్జాక్ట్లీ. తార?"

"స్టార్."

"రాజ?"

"కింగ్."

"భాన?"

"సన్?"

ప్రణవ్ బోర్డు మీద 'YAMA – STAR – KING – SUN' అని రాసి, దాని కింద పెద్ద అక్షరాలతో 'COSMIC PATTERN' అని రాశాడు.

"మన ఛందస్సులో కాస్మిక్ కనెక్షన్ ఉంది," అన్నాడు.

రాహుల్ చేయి ఎత్తాడు. "సర్, దీనిమీద రీల్ చేయచ్చా?"

"ష్యూర్. జస్ట్ ట్యాగ్ మీ."

ఆ సాయంత్రం రాహుల్ 'తెలుగు ఛందస్సులో దాగిన కాస్మిక్ కోడ్! మనకు చెప్పని నిజం!' అనే పేరుతో రీల్ పెట్టాడు. ముప్పై వేల మంది చూశారు. మూడు వేల మంది లైక్ చేశారు. నూట ఇరవై మంది 'మన సంస్కృతి గొప్పది' అని కామెంట్ చేశారు. ఒక్క తెలుగు పండితుడు మాత్రం 'నాయనా, అది గణాలు గుర్తుపెట్టుకునే సూత్రం' అని రాశాడు. రాహుల్ ఆ కామెంట్ డిలీట్ చేశాడు. "నెగటివిటీ వద్దు బ్రదర్," అని అతనికి వ్యక్తిగత సందేశం కూడా పంపాడు.

మూడో రోజు ప్రణవ్ అసైన్‌మెంట్ ఇచ్చాడు.

"ప్రతి ఒక్కరూ ఒక కంద పద్యం రాయాలి."

"కంద పద్యానికి నియమాలు ఏంటి సర్?" అని పద్మజ అడిగింది.

ప్రణవ్ పుస్తకం తిరగేశాడు.

కందము కింద చాలా ఉంది. పాదాలు, గణాలు, స్థానాలు, అంకెలు. చదువుతుంటే అతనికే పద్యం మీద భయం వచ్చేలా ఉంది. కానీ మొదటి రోజే పద్యం అంటే భయపడకూడదని చెప్పాడు. ఇప్పుడు తాను భయపడటం బ్రాండ్‌కు మంచిది కాదు.

"కంద అంటే మీకు తెలుసు కదా?" అని అడిగాడు.

"కందగడ్డ?" అన్నాడు సుబ్బారావు.

ప్రణవ్ అతని వైపు అభినందనగా చూశాడు.

"ఎగ్జాక్ట్లీ."

పద్మజ కెమెరా ఆఫ్ చేసింది.

"కందగడ్డ ఎక్కడ ఉంటుంది?" అని ప్రణవ్ అడిగాడు.

"భూమిలో."

"కనిపిస్తుందా?"

"లేదు."

"అలాగే కంద పద్యంలో అర్థం కూడా లోపల ఉండాలి."

రాహుల్ నోరు తెరిచి "వావ్!" అన్నాడు.

"పైకి చదివితే వెంటనే అర్థం కాకూడదా సర్?" అని శ్రీకాంత్ అడిగాడు.

ప్రణవ్ నవ్వాడు. "దటీజ్ పోయెట్రీ."

మరుసటి రోజు పదిహేడు కంద పద్యాలు వచ్చాయి. ఒక్కటీ అర్థం కాలేదు. ప్రణవ్ చాలా సంతోషించాడు. "అమేజింగ్. మీరు కందాన్ని క్యాచ్ చేశారు," అన్నాడు.

అందరిలో సుబ్బారావు పద్యం ప్రత్యేకంగా నిలిచింది. అతను రియల్ ఎస్టేట్ వ్యాపారి. గొంతు సవరించుకుని,

"కం. ప్లాటు కొనిన మేటియగును ,
రేటు పెరిగినంతయే సరియగును నీకున్
గేటులు పెట్టిన గృహములు,
ఫ్లాటులు బ్యాంకుల్ సరసపు వడ్డీలిచ్చున్"

అని చదివాడు.

ప్రణవ్ రెండుసార్లు చదివాడు.

"చాలా డీప్."

"థాంక్యూ సర్."

"ఇన్నర్ మీనింగ్?" అని అడిగాడు ప్రణవ్.

సుబ్బారావు కాసేపు ఆలోచించి,

"నాకూ తెలియదు సర్. మీరు అర్థం బయటకు రాకూడదన్నారు కదా," అన్నాడు.

ప్రణవ్ గొంతు సవరించుకున్నాడు. "అదే... అదే పోయెటిక్ మెచ్యూరిటీ."

నాలుగు వారాల్లో కోర్సు విజయవంతమైంది.

ప్రణవ్ కొత్త బ్యాచ్ ప్రకటించాడు—'ప్రాచీన తెలుగు ఛందస్సు – మోడర్న్ డీకోడింగ్.' ఫీజు నాలుగు వేల తొమ్మిది వందల తొంభై తొమ్మిది రూపాయలు. మొదటి బ్యాచ్ విద్యార్థులకు ఇరవై శాతం డిస్కౌంట్.

అదే సమయంలో పద్మజ ఒక స్థానిక సాహిత్య సంఘం నిర్వహిస్తున్న పద్య రచన పోటీ వివరాలు గ్రూపులో పెట్టింది. "మనమంతా పాల్గొందామా?" అని అడిగింది.

ప్రణవ్ వెంటనే 'This is your time to shine' అని స్పందించాడు.

పోటీ రోజు పదిహేడు మంది వెళ్లారు. ప్రణవ్ కూడా వచ్చాడు.

న్యాయనిర్ణేతగా విశ్వనాథం మాష్టారు కూర్చున్నారు. ఎనభై రెండేళ్లు. నలభై సంవత్సరాలు తెలుగు బోధించారు. భుజం మీద గుడ్డ సంచి. చేతిలో కర్ర.

మొదట శ్రీకాంత్ పద్యం చదివాడు.

మాష్టారు పూర్తిగా విని, "ఇది ఏ ఛందస్సు నాయనా?" అని అడిగారు.

"ఎమోషనల్ గురు బేస్డ్ కందం సర్," అన్నాడు శ్రీకాంత్.

మాష్టారు కళ్లద్దాలు తీసి తుడిచారు "మళ్లీ చెప్పు."

"ఎమోషనల్... గురు... బేస్డ్... కందం."

మాష్టారు కళ్లద్దాలు తిరిగి పెట్టుకున్నారు. తాను సరిగ్గా వినలేదేమో అన్న అనుమానం తీరిపోయింది.

తర్వాత రాహుల్ వచ్చాడు. "నా పద్యం యమ–స్టార్–కింగ్–సన్ కాస్మిక్ ప్యాటర్న్‌లో ఉంటుంది సర్," అన్నాడు.

మాష్టారు పక్కనున్న నిర్వాహకుడి వైపు తిరిగి, "ఇది పద్య పోటీయే కదా?" అని అడిగారు.

"అవును మాష్టారూ."

"మధ్యలో జ్యోతిష్యం వాళ్లను కూడా పిలిచారా?" అన్నారు.

చివరగా సుబ్బారావు తన ప్లాటు పద్యం చదివాడు.

మాష్టారు చాలాసేపు మౌనంగా ఉండి, "దీని అర్థం ఏమిటి?" అని అడిగారు.

సుబ్బారావు గర్వంగా "అర్థం బయటకు వస్తే కందం కాదు సర్," అన్నాడు.

విశ్వనాథం మాష్టారు కుర్చీలో వెనక్కి వాలారు.

"మీ గురువు ఎవరు?" అని అడిగారు. పదిహేడు వేళ్లు ఒకేసారి ప్రణవ్ వైపు తిరిగాయి.

ప్రణవ్ లేచాడు. "సర్, నేను ట్రెడిషనల్ గ్రామర్‌ని మోడర్న్ లెర్నర్స్ కోసం రీఇంటర్‌ప్రెట్ చేస్తున్నాను," అన్నాడు.

"ఏం చదివావు?" అని మాష్టారు అడిగారు. ప్రణవ్ సంచిలోంచి పాత పుస్తకం తీసి "సులక్షణ సారము" అన్నాడు.

మాష్టారు పుస్తకం తీసుకున్నారు. అట్ట చూశారు. మొదటి పేజీ చూశారు. నాలుగు పేజీలు తిరగేశారు. మధ్యలో ఒక పేజీని వెలుతురుకు అడ్డంగా పెట్టి చూశారు. తర్వాత నవ్వడం మొదలుపెట్టారు. మొదట చిన్నగా. తర్వాత భుజాలు కదిలేలా. చివరకు కళ్లద్దాలు తీసి కళ్లు తుడుచుకున్నారు.

"ఏమైంది సర్?" అని ప్రణవ్ అడిగాడు.

"ఇది సులక్షణ సారము కాదు నాయనా."

"అట్ట మీద..."

"అట్ట దానిదే," అన్నారు మాష్టారు.

"లోపల ఎవరో విద్యార్థి రాసుకున్న ఛందస్సు నోట్సులు. మధ్యలో పేజీలు లేవు. రెండు వేర్వేరు నోట్సులు కలిపి ఎవరో ఈ అట్టలో కుట్టారు."

ప్రణవ్ ముఖం చిన్నబోయింది.

మాష్టారు బోర్డు దగ్గరకు వెళ్లారు.

"లఘువు అంటే ఎమోషన్ తక్కువ అక్షరం కాదు."

శ్రీకాంత్ నోటు పుస్తకం తెరిచి 'Emotion–less letter = Laghu' అన్న వాక్యం మీద నెమ్మదిగా గీత కొట్టాడు.

"గురువు అంటే టీచర్ అక్షరం కాదు."

పద్మజ ప్రణవ్ వైపు చూడలేదు.

"యమాతారాజభానసలగం కాస్మిక్ కోడ్ కాదు."

రాహుల్ జేబులోంచి ఫోన్ తీసి తన రీల్ డిలీట్ చేశాడు. మూడు సెకన్లు ఆలోచించి ట్రాష్ నుంచి కూడా డిలీట్ చేశాడు.

"కంద పద్యానికి కందగడ్డతో సంబంధం లేదు."

సుబ్బారావు చేయి ఎత్తాడు. "మాష్టారూ..."

"ఏంటి నాయనా?"

"మరి నా ప్లాటు పద్యం?"

మాష్టారు అతని భుజం తట్టి, "ప్లాటు అమ్మడానికి పనికొస్తుంది. పద్యానికి కాదు," అన్నారు.

హాలంతా నవ్వింది.

ప్రణవ్ మాత్రం నవ్వలేదు.

కార్యక్రమం అయిపోయాక అందరూ వెళ్లిపోయారు.

ప్రణవ్ మాత్రం మాష్టారు దగ్గరకు వచ్చాడు. "సర్... నేను పెద్ద తప్పు చేశాను," అన్నాడు.

మాష్టారు పుస్తకాన్ని సంచిలో పెట్టుకుంటూ, "తప్పు చేయడం పెద్ద తప్పు కాదు నాయనా. తెలియనిది తెలుసునని చెప్పడం కూడా ఒక్కోసారి జరుగుతుంది. కానీ తెలియనిది తెలుసునని లైవ్ పెట్టి, లింకు షేర్ చేసి, కింద 'ఎన్‌రోల్ నౌ' పెట్టడమే కొంచెం ప్రమాదం," అన్నారు.

ప్రణవ్ తల దించుకున్నాడు.

"రేపటి నుంచి నా దగ్గరకు రా," అన్నారు మాష్టారు.

"ఛందస్సు నేర్పిస్తారా సర్?"

"నేర్పిస్తాను. కానీ ముందు పుస్తకం పూర్తిగా చదవడం నేర్పిస్తాను."

మరుసటి ఆదివారం ఉదయం పదకొండు గంటలకు మళ్లీ పదిహేడు ల్యాప్‌టాపులు తెరుచుకున్నాయి. ప్రణవ్ కెమెరా ఆన్ చేశాడు. అతని వెనుక కొత్త బోర్డు ఉంది—'తెలుగు పద్యం: జీరో నుంచి... నెమ్మదిగా ముందుకు.' పక్కనే విశ్వనాథం మాష్టారు కూర్చున్నారు.

"గుడ్ మార్నింగ్, పోయెట్స్," అన్నాడు ప్రణవ్.

అందరూ నవ్వారు.

"ఇవాళ లఘువు, గురువు నేర్చుకుందాం."

శ్రీకాంత్ చేయి ఎత్తాడు. "సర్... గురువు అంటే?"

ప్రణవ్ విశ్వనాథం మాష్టారు వైపు చూపించి, "ప్రస్తుతానికి ఆయన," అన్నాడు.

అందరూ నవ్వారు.

"మరి లఘువు?" అని రాహుల్ అడిగాడు.

ప్రణవ్ తనవైపు చూపించుకుని, "నెల రోజుల క్రితం నా జ్ఞానం," అన్నాడు.

ఈసారి చాట్ బాక్సులో చప్పట్ల గుర్తులు రాలేదు. 'వావ్' అని ఎవరూ రాయలేదు. 'డీప్' అని కూడా ఎవరూ అనలేదు. పదిహేడు మంది నిశ్శబ్దంగా పుస్తకాలు తెరిచారు. విశ్వనాథం మాష్టారు నెమ్మదిగా తల ఊపారు.

"ఇప్పుడు పద్యం నేర్చుకునే లక్షణం వచ్చింది నాయనా" అన్నారు.

ప్రణవ్ మొదటిసారి కెమెరా వైపు చూడలేదు. పుస్తకం వైపు చూశాడు.

COMMENTS